# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 26 సెప్టెంబరు, 2026 | పేజీలు :08


## రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం/కరీంనగర్:** అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు తరచుగా తనిఖీలు చేస్తూ రోడ్ వర్క్ పనులు, ప్రమాదకర ప్రదేశాలు గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండానిబంధనలకు లోబడే హోర్డింగులు, ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో కోర్టు, బస్టాండ్ వద్ద తరచుగా పైపులైన్ కు లీకేజీ ఏర్పడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. సర్కిల్ వారీగా తనిఖీలు చేసి సమస్యలు గుర్తించి పరిష్కరించాలని సూచించారు. అదనపు డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, హిట్ అండ్ రన్ కేసుల వివరాలు వివరించారు. ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జంక్షన్ నుంచి పద్మనగర్ వెళ్లే రోడ్డుతో

తరువాయి 2లో

# సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/పెగడపల్లి:** ధర్మపురి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్యమంత్రి సహాయనిధి, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత ధర్మపురి నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి సాగునీరు అందించేందుకు అవసరమైన నిధులు కేటాయిస్తూ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. గొల్లపల్లి మండలంలోని రంగధాముని పల్లి, దీకొండ చెరువులను అభివృద్ధి చేసి పెగడపల్లి మండలానికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను సమన్వయం చేసుకుంటూ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. 39 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.39,04,524 విలువైన చెక్కులు, 102 మంది సీఎం సహాయనిధి లబ్ధిదారులకు రూ.35,39,500 విలువైన చెక్కులు పంపిణీ చేసినట్లు మంత్రి వివరించారు. వచ్చే దసరాకు మహిళలకు ఇందిరమ్మ చీరలు అందించనున్నట్లు తెలిపారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి ధర్మపురి నియోజకవర్గంలో ఇప్పటికే రూ.117 కోట్ల నిధులు మంజూరయ్యాయని, అదనంగా రూ.80 కోట్ల నిధుల కోసం కోరగా ఆర్థిక శాఖ నుంచి అనుమతి లభించినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు,తహశీల్దార్ నిజామొద్దిన్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఆర్ ఐ జమున,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి, ఒరుగల శ్రీనివాస్,సంది మల్లారెడ్డి,పూసాల తిరుపతి,సర్పంచులు బలరాం రెడ్డి,రమేష్ నాయక్,లక్ష్మణ్, రాజేశం,కుమార్, గోపాల్, రాకేష్,నాయకులు రాజు,రాజ్ కుమార్, బండారు శ్రీనివాస్, దప్పు నర్సయ్య, నవీన్, కుంచె రాజేందర్,శ్యాంసుందర్ రెడ్డి, విజయ భాస్కర్, పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# గంగమ్మ ఒడికి గణనాథుడు



### 300 మంది పోలీసుల బందోబస్తు
### నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలించిన ఎస్పి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణ కేంద్రంలో గణేశ్ నిమజ్జన ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో గణనాథున్ని పూజించి కోరిన కోర్కెలు తీర్చమని వేడుకున్నారు. అనంతరం పట్టణ వాసులు గణనాథులను కోలాటం ఆడుతూ భక్తి శ్రద్ధలతో నిమజ్జనానికి సిరిసిల్ల మానేరు ఒడ్డుకి తీసుకొచ్చి నిమజ్జనం చేశారు.



**వినాయకున్ని ఎందుకు నిమజ్జనం చేస్తారు?**
వినాయకుడిని నిమజ్జనం చేసే ఆచారం హిందూ సంప్రదాయం ప్రకారం వస్తూ ఉంది. వ్యాస మహర్షి మహాభారతాన్ని రచిస్తుండగా దాన్ని తెగకుండా రాయడానికి వినాయకుడు అలంకరించి కూర్చున్నాడని ఈ పది రోజుల పాటు అవిశ్రాంతంగా రాయడం వల్ల వినాయకుడికి శరీరం వేడెక్కిపోయి ఆయన శరీర ఉష్ణోగ్రతను తగ్గించడానికి వ్యాసుడు అనంత చతుర్ధశి రోజు వినాయకుడికి చల్లని నీటితో స్నానం (జల నిమజ్జనం) చేయించాడని ఒక ప్రాచుర్యంలో ఉన్న కథ. ఈ పది రోజుల పూజల తరువాత నిమజ్జనం చేసే ఆచారం అప్పటి నుంచే వచ్చిందని పురాణాలు చెబుతున్నాయి. పురాణాల ప్రకారం నిమజ్జన రోజున వినాయకుడు తన తల్లిదండ్రులైన పార్వతి పరమేశ్వరుల వద్దకు తిరిగి వెళ్తాడని నమ్ముతారు.

**పల్లకిలో నిమజ్జనానికి తరలివెళ్లినన గణనాథుడు:** సిరిసిల్ల పట్టణంలోని మెహర్‌నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపథునికి 10 రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం కోలాటం ఆడుతూ హిందూ సంప్రదాయాం ఉట్టిపడేలా భజనలు, కోలాటం ఆడుతూ వినూత్న పద్ధతిలో పల్లకిలో వినాయకున్ని తీసుకెళ్లి మానేరు నదిలో నిమజ్జనం చేశారు.

**వినాయక నిమజ్జనాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ :** సిరిసిల్ల మానేరు నదిలో నిర్వహిస్తున్న

తరువాయి 2లో

# భూసేకరణలో దళారుల చేతిలో మోసపోవద్దు

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, ఎన్టీపీసి, సింగరేణి, రాజాపూర్ ప్రాంతాలలో జరుగుతున్న భూసేకరణతో పాటు, జాతీయ రహదారులు, రైల్వే మార్గాల విస్తరణ నిమిత్తం జరుగుతున్న భూసేకరణ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేరుగా బాధితులకే నష్టపరిహారం అందుతుందని, ఎవరైనా మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.రామగుండం,ఎన్టీపీసి, సింగరేణి, రాజాపూర్ ప్రాంతాలలో సింగరేణి సంస్థకు సంబంధించిన భూసేకరణ జరుగుతుండగా,జిల్లాలో వివిధ ప్రాంతాలలో కొత్త జాతీయ రహదారులు,రైల్వే మార్గాల నిర్మాణం కోసం భూములు సేకరిస్తుండగా,కొంతమంది దళారులు, మధ్యవర్తులు ప్రవేశించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ నష్టపరిహారం ఇప్పిస్తామని నమ్మిస్తూ అమాయక ప్రజల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. భూమి కోల్పోతున్న బాధితులు ఎవరూ ఇలాంటి దళారులు, మధ్యవర్తుల మాయ మాటలను నమ్మి మోసపోవద్దని, ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రావాల్సిన నష్టపరిహారాన్ని ప్రభుత్వ అధికారులే నేరుగా బాధితులకు తెలియజేసి అందజేస్తారని, పరిశ్రమలు, సింగరేణితో పాటు నేషనల్ హైవేస్, రైల్వే భూసేకరణ విషయాలలోనూ మధ్యవర్తులు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, మోసపూరితంగా వ్యవహరించినా వెంటనే సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని, అనధికార వ్యక్తులను నమ్మి మోసపోవద్దు జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ, హక్కులపై అవగాహన కల్పించాలి:** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా, జిల్లాలోని వయోవృద్ధుల సంక్షేమం, సంరక్షణ, వారి హక్కులకు సంబంధించిన పోస్టర్లు, "ఎల్డర్ గైడ్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వయోవృద్ధుల సంక్షేమ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూఅంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంరక్షణ, భద్రత, సంక్షేమం, చట్టబద్ధమైన హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, వృద్ధులను గౌరవంగా చూసుకోవడం, వారి అవసరాలను గుర్తించి తగిన సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయసూపరింటెండెంట్ రాజయ్య, పెద్దపల్లి టాస్క్ అధికారి కౌసల్య , ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ స్వర్ణలత, పాల్గొన్నారు.



# వినాయక నిమజ్జనోత్సవాలను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/జగిత్యాల :** తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు జగిత్యాల జిల్లా ప్రజలు ఘనంగా వీడ్కోలు పలుకుతున్నారు.శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా, ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు వద్ద నిమజ్జనోత్సవాల తీరును జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు.పట్టణంలో అత్యధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు చింతకుంట చెరువు వైపు తరలి వెళ్తున్నాయి.నిమజ్జనాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టిందిని తెలిపారు. విగ్రహాలను తీసుకొచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్గాలను పర్యవేక్షించడంతో పాటు నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.చెరువు వద్ద నిమజ్జన కేంద్రాలను సిద్ధం చేశారు. భక్తులు, ఉత్సవ కమిటీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, విద్యుత్, లైటింగ్ తదితర ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, మున్సిపాలిటీలు, ఇతర విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయ



డంతో నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగుతున్నాయి. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, తహసీల్దార్ రామ్ మోహన్, సంబంధిత అధికారులు,మున్సిపల్ సిబ్బంది, మరియు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి మ్యూజిక్ పోటీలలో పారమిత విద్యార్థి ప్రతిభ



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** ఇటీవల క్యాషియో, మాస్టర్ మ్యూజిక్ అన్లైన్‌లో నిర్వహించిన సంగీత పోటీలలో స్థానిక పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల 8వ తరగతికి చెందిన కె.చరణ్ జాతీయస్థాయిలో మూడవ స్థానం సాధించాడని పాఠశాల డైరెక్టర్ కె.హన్మంత రావు తెలిపారు. జాతీయస్థాయిలో అవార్డు పొందిన విద్యార్థితో పాటు మ్యూజిక్ టీచర్ జితుమణిశర్మను పారమిత పాఠశాలల అధినేత డా.ఇ.ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారమిత పాఠశాల కేవలం చదువుకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ, సమన్వయకర్తలు రబీంద్రపాత్రో, భవానీ, నిఖిత, సంగీత తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యంతోనే దేశాభివృద్ధి



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** మత సామరస్యంతో హిందూ, ముస్లీం, సిక్కు తదితర అన్ని మతాల వారు కలిసిమెలిసి జీవించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మించిన మాసాన్ని పురస్కరించుకొని జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో కరీంనగర్ మహాత్మా జ్యోతిభా పూలే మైదానంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన నగర బిఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనిషి జీవితకాలంలో ప్రతి ఒక్కరితో స్నేహభావంతో కలిసిమెలిసి జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, కార్పోరేటర్లు యూసుఫ్, అలీ, నాయకులు గాదె శ్రీనివాస్, పలువురు నాయకులు, జమాతే ఇస్లామీ హింద్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం



**ప్రజాపక్షం/జగిత్యాల :** విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తానని,ఎన్నికల వరకు రాజకీయాలు ఉంటాయాయని ఆ తర్వాత అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎస్‌డిఎఫ్ నిధులు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన నాయి బ్రాహ్మణ సంఘం అదనపు కార్యాలయాన్ని జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ కలిసి జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలోని అన్ని కుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. యూఐడీఎఫ్ నిధులు రూ.62.5 కోట్లతో జగిత్యాల పట్టణంలోని అన్ని వార్డులకు రూ.కోటికి తక్కువ కాకుండా నిధులు కేటాయించి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలుతీసుకుంటున్నామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో dcc అధ్యక్షులు గాజంగి నందయ్య ,కౌన్సిలర్ వేముల శ్రీనివాస్,సంఘం అధ్యక్షులు పెండెం మహేందర్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ



**ప్రజాపక్షం/జమ్మికుంట:** మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గత రెండు మాసాల క్రితం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె) వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపాలు ఉన్న 38 మంది విద్యార్థులను గుర్తించగా వారికి కళ్లద్దాలు శుక్రవారం ఆర్‌బిఎస్‌కె వైద్య బృందం హుజురాబాద్ డిప్యూటీ డిఎంహెచ్‌వో డా.ప్రభుదాస్ చేతులమీదుగా విద్యార్థులకు కళ్లద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్‌వో మాట్లాడుతూ కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. మంచి పోషకాలతో నిండిన సమతుల్య ఆహారం తీసుకోవాలని తగినంత నిద్రపోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరలా పరిశుభ్రత పాటించాలని మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె వైద్యాధికారి డా.మొగిలి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అశ్విని, ఫార్మసిస్ట్ పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కరీంనగర్‌కు మంత్రుల రాక

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ జిల్లా కేంద్రానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలు నేడు రానున్నారు. కరీంనగర్ జిల్లా గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని గొర్రెలు, మేకల పెంపకం దారుల ప్రత్యేక సమావేశం స్థానిక ఇందిరా భవన్ లో జరగనుంది. రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభి వృద్ధి, మత్స్య శాఖ, క్రీడలు యువజన వ్యవహారాల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర రవాణా శాఖ, వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖామంత్రి పొన్నం ప్రభాకర్ లతో పాటు రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య, రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ డా. బి.సుబ్బారాయుడు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి గొర్రెలు మేకల బీమా పథకాన్ని ప్రారంభిస్తారు. 3 వేల రూపాయల ప్రీమియం నుండి 8 వేల రూపాయల వరకు ప్రీమియం ఉండే గొర్రెల బీమా పథకానికి సంబంధించిన వివరాలను మంత్రి వివరిస్తారు.ఈ ప్రత్యేక సమావేశంలో జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల ఎన్నికలు, ఆస్తుల పంపిణీ గురించి పలు విషయాలు చర్చించడం జరుగుతుందని కరీంనగర్ జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖాధికారి డా. ఎన్. లింగారెడ్డి తెలియచేశారు. జిల్లా గొర్రెలు మేకల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన బాసవేని మల్లయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలిపారు.

## నేడు వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు తెలంగాణ వీరనారి, సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నేడు కరీంనగర్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు కానుంది. శనివారం ఉదయం 11.30 గంటలకు కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులోని ప్రతిమ మల్టిప్లెక్స్ ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం ప్రాంగణంలో ఈ వేడుకలను నిర్వహించనున్నారు.
తెలంగాణ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన వీరత్వాన్ని త్యాగాలను స్మరించుకునేందుకు ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, ప్రజలు, రజక కుల బంధువులు వివిధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై జయంతి వేడుకలను విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

## గంగమ్మ ఒడికి గణనాథుడు

మొదటి పేజీ తరువాయి

చక్రపాణి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక నిమజ్జనం మహోత్సవాన్ని పురస్కరించుకొని వినాయక మండప నిర్వహణకు భక్తులకు ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో మానేరు నది తీరంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా బారికేడ్లను, భారీ క్రేన్‌లను,, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి ఏర్పాటు, సీసీ కెమెరాలు, అన్ని ఏర్పాట్లు చేస్తూ నిరంతరం వీటి పర్యవేక్షణ కోసం అధికారులను నియమించారన్నారు.

**300 మంది పోలీసులు బందోబస్తు**

నిమజ్జనం సందర్భంగా సుమారు 300 మంది పోలీస్ అధికారులు సిబ్బందితో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ డైవర్షన్లను తదితర భద్రతా చర్యలను చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. శోభాయాత్రలు వెళ్లే మార్గాలు, ప్రధాన కూడళ్లు, నిమజ్జన ప్రాంతాలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పికెట్లు, పార్టీలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేపట్టామని తెలిపారు. ఎస్పీ వెంట డిఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సిఐలు, ఆర్ఐలు, ఎసైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

మొదటి పేజీ తరువాయి

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రధాన రహదారిపై రోడ్లపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలని అధికారులకు సూచించారు. కరీంనగర్ – వరంగల్ రహదారి పనులు 99 శాతం పూర్తయ్యాయని.. హైవేను నిరంతరం సిసి కెమెరాల ద్వారా మానిటర్ చేస్తున్నట్లు ఎన్ హెచ్ఏఐ అధికారులు వివరించారు. ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.నిర్ణీత వేగం దాటితే ఆటోమేటిక్ చలాన్లు విధిస్తూ ఎమర్జెన్సీ కాల్ బాక్సులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీటీఓ జైపాల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఏఎంవీలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం

**ప్రజాపక్షం/గన్నేరువరం :** గన్నేరువం మండల కేంద్రంలో గణేశ్ నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. నవరాత్రోత్సవాలు భాగంగా నిత్య పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన లంబోదరుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని వివిధ మండపాల నుంచి వినాయక విగ్రహాలను శోభాయాత్రగా తీసుకెళ్లారు. డప్పు వాయిద్యాలు, తీన్మార్ డాన్సులు, భక్తుల నడుమ శోభాయాత్ర ఉత్సాహభరితంగా సాగింది. యువకులు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేస్తూ ఊరేగింపులో సందడి చేశారు. అనంతరం స్థానిక చెరువులలో స్వామివారి విగ్రహాలను భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు.నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగియడంతో ప్రభుత్వ యంత్రాంగం, గ్రామస్థులు, ఉత్సవ కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

## సఖీ కేంద్రం సేవలు మరింత సమర్థవంతంగా అందించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** మహిళలకు రక్షణ, న్యాయ సహాయం, కౌన్సిలింగ్‌తోపాటు అవసరమైన సేవలను అందిస్తున్న సఖి వన్‌స్టాఫ్ సెంటర్ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ సూచించారు. శుక్రవారం ప్యానల్ అడ్వకేట్లతో కలిసి కరీంనగర్ సఖి వన్‌స్టాఫ్ సెంటర్‌ను సందర్శించిన ఆయన కేంద్రంలో నమోదవుతున్న కేసులు, బాధితులకు అందుతున్న న్యాయ సహాయం, కౌన్సిలింగ్, వైద్య సహాయం తాత్కాలిక ఆశ్రయం తదితర సేవలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు, కేసు ఫైళ్లు, రికార్డులను పరిశీలించి కేసుల పురోగతిపై సమీక్షించారు. షెల్టర్ రూమ్, కౌన్సిలింగ్ గదులు, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతతోపాటు బాధితులకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావారణం కల్పించాలని సూచించారు. ప్రొటెక్షన్ ఆఫీసర్, సఖి కేంద్రం ద్వారా దాఖలయ్యే గృహహింస కేసులను క్రమం తప్పకుండా సమీక్షిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలు, లీగల్ కౌన్సిల్, సఖి సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మహేశ్ తనుకు, ప్యానల్ అడ్వకేట్లు ఏ.కిరణ్ కుమార్, పెరుక రంగయ్య, సిహెచ్ చంద్రప్రకాశ్ రెడ్డి, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ దామెర లక్ష్మి, లీగల్ కౌన్సిలర్ ఎన్.సంధ్యారాణి, సోషల్ కౌన్సిలర్ రేణుక, కేస్ వర్కర్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

# అటవీ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలోని అటవీ భూములు, వన్యప్రాణుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే.. సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అటవీ శాఖ, వన్యప్రాణుల ప్రొటెక్షన్ కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) శ్రీనివాసరెడ్డి, అటవీ శాఖ అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో అటవీశాఖ భూములు ఉన్నాయని.. ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు సరిహద్దులు ఏర్పాటు చేయాలన్నారు. డీఎఫ్ఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి.. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. జిల్లాకేంద్రంలోని బైపాస్ వద్ద ఎన్టీఆర్ బొమ్మ సమీపంలో అటవీ శాఖ చెక్ పోస్ట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.
అటవీశాఖ ఎన్ఓసీ ఇచ్చిన తర్వాతే మైనింగ్ అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇరుకుల్ల ఫారెస్ట్ బ్లాక్ పరిధిలో అటవీ శాఖ భూములకు సరిహద్దులు నిర్ణయించాలని పేర్కొన్నారు. సైదాపూర్ మండలం రాయికల్ వాటర్ ఫాల్స్ కు జన సందడి పెరుగుతున్నందున.. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అటవీ శాఖ అధికారులు కోరారు. ఈ సమావేశంలో ఎఫ్ఆర్ఓలు షోకత్ హుస్సేన్, లత తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్, డీఈవో చైతన్య జైనీ, డిఎంహెచ్వో రాజగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆకుల నరసయ్య మృతి అత్యంత బాధాకరం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన వెటర్నరీ డాక్టర్ ఆకుల నరసయ్య మరణం అత్యంత బాధాకరణమని రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ ఉప్పు తిరుపతి అన్నారు.శుక్రవారం రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ తిరుపతి, స్థానిక సర్పంచ్ గుడుగుల సతీష్ తో కలిసి నరసయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## కెటిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉషక్క

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు, బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా చైర్మన్ దాసరి ఉష శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యా రంగం, బీసీ వర్గాల అభివృద్ధి తదితర అంశాలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన అంశాలపై చర్చించి, ప్రజల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ తరఫున నిరంతరం కృషి చేస్తామని దాసరి ఉష తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలతో కలిసి మరింత చురుకుగా పనిచేస్తామని దాసరి ఉష తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## దీన్ దయాల్ సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/చొప్పదండి :** పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు చొప్పదండిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ బిజేపి అధ్యక్షుడు చిల్ల శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజేపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ మాట్లాడుతూ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఏకాత్మ మానవవాద సిద్ధాంతంతో బిజేపికి పటిష్ట పునదాలు వేశారని అన్నారు. అయన ఆశయాలతోనే కేంద్రం అంత్యోదయ, ఆత్మనిర్భర్ భారత్ దిశగా పయనిస్తోందని అన్నారు. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి జిట్ట కుమార్, బిజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మంచికట్ల మల్లేశ్, మాజీ అధ్యక్షులు బత్తిని ప్రశాంత్, నాయకులు సంపత్, గుండేటి వెంకటరమణ, తాడూరి రామకృష్ణ, ఎడవెల్లి రాజారాం, అమరగొండ తిరుపతి, జాగిరి రాజేందర్, రాకేశ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## మిడ్ మానేరు నిర్వాసితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



**ప్రజా పక్షం/వేములవాడ:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 30 న సిరిసిల్ల పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మిడ్ మానేరు ముంపు గ్రామ నిర్వాసిత కుటుంబానికి ఐదు లక్షల నాలుగు వేల రూపాయల పరిహారాన్ని వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఉపాధి కల్పన హామీతో పాటు నిర్వాసితుల పెండింగ్ సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంతమంది నిర్వాసితులకు ఇళ్లు మంజూరు చేశారు, ఎంతమంది నిర్మించుకున్నారనే వివరాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బ్యాంకులు, ఇతర చోట్ల అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న నిర్వాసితులను ఆదుకోవాలన్నారు. మూడేళ్లు గడిచినా సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయని, ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి నిర్వాసితులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వేములవాడ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు లింగంపల్లి శంకర్, జింక అనిల్, సురువు వెంకట్, జిల్లా కౌన్సిల్ మెంబర్ జక్కుల తిరుపతి, ఇతర మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలి




**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** రామగుండం సి. పి ఆదేశాల మేరకు,షీ టీమ్ ఇంచార్జ్ లావణ్య ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ గ్రామం లోని మహాత్మా జ్యోతిబా పూలే బాయ్స్ స్కూల్, విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు.అందులో భాగంగా షీ టీమ్ మెంబర్ స్నేహలత మాట్లాడుతూ గుడ్ టచ్ బాడ్ టచ్, తెలియని వారి పట్ల ఎలా ఉండాలి, పోక్సో యాక్ట్ పై పవిత్ర అంశాలపై అవగాహన కల్పించడమే కాకుండా సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది, విద్యార్థుల ప్రవర్తన నియామవాలి గురించి తెలిపారు. మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలపై యాంటీ డ్రగ్స్ గురించి తెలిపారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిఘా ఉంటుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు.అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే,బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని, అలాగే అన్లైన్ మోసాలకు గురైతే 1930 కి ఫోన్ చేయాలనీ, మహిళలకు ప్రయాణ సమయం లో ట్రావెలింగ్ సేఫ్టీ అప్ టీ సేఫ్ అప్ వాడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హేంద్రి,ఉపాధ్యాయులు షీ టీమ్ సభ్యులు,మౌనిక పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీ కొరత రాకుండా చర్యలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీ కార్మికులకు కొరత రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులు ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్ల పై హమాలీ సంఘాల ప్రతినిధులు, లారీ ఓనర్ల యాజమాన్యంతో సంబంధిత అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైస్ మిల్లుల్లో హమాలీల సమస్య తలెత్తకుండా ముందస్తుగా హమాలీలను సమకూర్చుకోవాలని, స్థానికంగా హమాలీలా కొరత ఉంటే ప్రత్యామ్నాయంగా బీహార్ కార్మికులను అందుబాటులో ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.ధాన్యం రవాణా చేసే ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకర్ తప్పనిసరిగా ఉండాలని, ఓవర్‌లోడ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, మాయిశ్చర్ మీటర్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉండేలా మెట్రాలజీ అధికారులు తనిఖీ చేయాలన్నారు.ఈసారి కొనుగోలు ప్రక్రియలో ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నందున, క్షేత్రస్థాయిలో తాజా ఫొటోలు, వివరాలను మాత్రమే నమోదు చేయాలని, జిల్లాలో ధాన్యం నిల్వకు గోదాము స్థలాన్ని ముందుగానే గుర్తించాలన్నారు.అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నందున, ఆ నాటికి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మిల్లుల మ్యాపింగ్, రవాణా, గోదాముల గుర్తింపు తదితర అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, లారీ ఓనర్ల యాజమాన్యం, హమాలీ సంఘాల ప్రతినిధులు,రవాణా కాంట్రాక్టర్లు,సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చల్మెడ



**ప్రజా పక్షం/వేములవాడ:** వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన సామ ఎల్లారెడ్డి ఇటీవల గుండెపోటుకు గురై మృతి చెందగా మరియు వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామానికి చెందిన జూల భారతికి ఇటీవల శస్త్రచికిత్స జరగగా వారిని ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని తెలుసుకుని అలాగే, ఇదే గ్రామానికి చెందిన బోరుగయ కాశీరామ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట వారి వెంట మండల అధ్యక్షుడు గోసుకుల రవి, సీనియర్ నాయకులు ఏస తిరుపతి, గ్రామ సర్పంచ్ సామ తిరుపతి రెడ్డి, జంకే శ్రీనివాస్ రెడ్డి, సామ లచ్చిరెడ్డి, పసుల అంజి, నాయకులు మెరుపుల కార్తిక్ రెడ్డి, శ్రవణ్, రమేష్, శ్రీనివాస్, గంగరాజు, సాయి, గోవర్ధన్, హన్మయ్య, వివేక్, తదితరులు ఉన్నారు.

## సహకార సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం/ముత్తారం:** రైతుల ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యం ఇస్తూ సహకార సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు.శుక్రవారం మంథనిలోని సహకార సంఘ కార్యాలయంలో నిర్వహించిన 89వ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.సమావేశం ప్రారంభంలో సంఘ మాజీ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ అకాల మృతికి సంతాపంగా సభ్యులు మౌనం పాటించారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## అదరగొట్టిన కోలాటం బృందం

**ప్రజాపక్షం/రామగిరి:** రామగిరి మండలం బేగంపేట్ ఎక్స్ రోడ్‌లో లడ్డు యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన గణేష్ నిమజ్జన వేడుకలు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శ గ్రామీణ కళల వైభవాన్ని చాటిచెప్పింది.కోలాటంలో తోట్ల తిరుపతి యాదవ్ స్థానిక నాయకులు కోలాట నుత్యాన్ని ప్రదర్శించారు ,యువత ఆధ్యాత్మిక,సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ద్వారా భావితరాలకు సంప్రదాయాలను అందించిన వారవుతారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక అభినందనలు.విఘ్నేశ్వరుని ఆశీస్సులు రామగిరి ప్రజలందరి పై మెండుగా ఉండాలని కోరుకుంటున్నానని తోట్ల.తిరుపతి యాదవ్ తెలిపారు.

## మరణించిన కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



**ప్రజాపక్షం/రామగిరి:** రామగిరి మండలం లద్నాపూర్ గ్రామంలో మాజీ ఎంపిటిసి మేడగోని రాజయ్య చెల్లి అరెల్లి మల్లేశ్వరి ఇటీవల మరణించగ శనివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట.మధూకర్ ఆమె చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశాడు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి. సత్యనారాయణ, మండల అధ్యక్షుడు శంకేసి. రవీందర్, మాజీ మండల రైతు బంధు అధ్యక్షుడు మ్యాదరవేన కుమార్ నాయకులు కాపరబోయిన భాస్కర్,రొడ్డ శ్రీనివాస్,దామెర శ్రీనివాస్,బర్ల కుమార్,తుమ్మల అశోక్,బడికెల శ్రీనివాస్,గెల్లు భార్గవ్,గొర్రె రవి, గొర్రె నాగరాజు,మేడగోని రాజీర్,చిప్ప రాజు,బేతు రాజయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో జరుగు జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్‌:** శుక్రవారం రోజున ఎ.ఐ.కె.ఎం.ఎస్ జిల్లా కమిటీ ఆద్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అంభేద్కర్ కూడలి వద్ద, ఈనెల 28, 29, 30 వ తేదీలలో ఖమ్మం జిల్లా కేంద్రంలో జరుగు బహిరంగసభ జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది.ఈసందర్భంగా ఎ.ఐ.కె.ఎం.ఎస్ జిల్లా అధ్యక్షులు మేరుగు చంద్రయ్య, మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు,కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు, ఎన్నికల సమయంలో రైతులకు,వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలుచేయడంలోప్రభుత్వాలు విఫలమైయ్యాయని,కేంద్రంలో నరేంద్రమోడి ప్రభుత్వం కొత్త కొత్త చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని స్వదేశి, విదేశి కార్పోరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తుందనీ, ఇందులో బాగంగానే మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకొచ్చందని దీనిపై దేశవ్యాప్తంగా రైతులు పెద్ద ఎత్తున ఉద్యమించారని, చివరకు ఆ మూడు చట్టాలను 2021లో రద్దు చేయాల్సి వచ్చిందని,ప్రస్తుతం ఈ రైతు వ్యతిరేక చట్టాలను మరో రూపంలో అమలు పరచుటకై అమెరికా లాంటి పెట్టుబడిదారి దేశాలతో ఫ్రీ వాణిజ్య ఒప్పందాలు(ఎఫ్.టి.ఎ) చేసుకుందని, దీన్ని రద్దు చేసుకోవాలని ఎ.ఐ.కె.ఎం.ఎస్ దేశ వ్యాప్త ఆందోలన కార్యక్రమాలు నిర్వహించిందని గుర్తు చేసారు ఈ కార్యక్రమంలో ఎ.ఐ.కె.ఎం.ఎస్ ప్రదాన కార్యదర్శి గుండేటి మల్లేశం, కోశాదికారి ఐ రాజేశం నాయకులు కాదాసి లింగమూర్తి, గుండు రాజయ్య, సి హెచ్ శంకర్, బాలకృష్ణ,బాబన్న, అనిల్, పాల్గొన్నారు.




## ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఎంపిడిఒ



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వడ్డెర కాలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపిడిఒ సీహెచ్ గణేష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశా రు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి నాణ్యతను, పాఠశాల రికార్డులను పరిశీలించారు.వర్షాల నేపథ్యంలో పాఠశాల పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి పుల్ల రామకృష్ణను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణ ప్రదీప్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

### కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/మెడిపెల్లి :** నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు.భీమారం మండలంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా రాజలింగంపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని,నిర్మాణ నాణ్యతను పరిశీలించి, పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా భవనాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు .అనంతరం భీమారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, భవనం నాణ్యత, మౌలిక వసతుల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.చిన్నారులకు అనుకూలంగా, సురక్షితమైన వాతావరణం కల్పించే విధంగా అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారుఈ పరిశీలనలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి,తహసీల్దార్ వసంత,తదితరులు ఉన్నారు.

## 27న చలో యాదగిరిగుట్ట: 'కృతజ్ఞతా సదస్సు' పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** యాదగిరిగుట్టలో నిర్వహించనున్న కృతజ్ఞతా సదస్సు గోడపత్రిక (పోస్టర్)ను తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం (టీయూఎఫ్) రాష్ట్ర కన్వీనర్ కళాతపస్వి యెల్ల పోశెట్టి ఆవిష్కరించారు. శుక్రవారం వేములవాడలోని తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యెల్ల పోశెట్టి మాట్లాడుతూ.. ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్ (జిట్ట బాలకృష్ణారెడ్డి ప్రాంగణం)లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలతో పాటు, ఉద్యమకారుల గుర్తింపు కేకే కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపేందుకు ఈ కృతజ్ఞతా సదస్సును నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులు, కళాకారుల ఆత్మగౌరవం, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం సదస్సులో అనేక ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి 10 ఉమ్మడి జిల్లాల చైర్మన్లు, 33 జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల బాధ్యులు, కవులు, కళాకారులు, రచయితలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## మెట్‌పల్లిని పచ్చదనంతో నింపడమే లక్ష్యం



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మెట్‌పల్లి పట్టణంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నేషనల్ హైవే డివైడర్ల మధ్యలో 400 మొక్కలు, ఉర్దూ మీడియం హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని,భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, పాఠశాలలు, ఖాళీ ప్రదేశాల్లో మరిన్ని మొక్కలు నాటి సంరక్షించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ , కౌన్సిలర్లు బొడ్ల ఆనంద్, బత్తుల నరేష్, అరిగెల అనూష, నాయకులు అరిగెల రాకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్ నాయక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో ప్రభుత్వం నిబంధన ప్రకారం విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు.మధ్యాహ్న భోజనంలో విద్యార్థినులకు వడ్డిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా రుచి చూసి పరిశీలించారు.విద్యార్థినులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన,పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు,మండల పంచాయతీ అధికారి ప్రదీప్,పంచాయతీ కార్యదర్శి పి.రాజు ,ఉపాధ్యాయ బృందం,తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న ఆర్‌టిసి డ్రైవర్, కండక్టర్

### పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి అప్పగింత



**ప్రజాపక్షం/ముత్తారం:** గోదావరిఖని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు మరిచి పోయిన విలువైన సెల్ ఫోన్‌ను సురక్షితంగా తిరిగి అప్పగించి ఆర్టీసీ డ్రైవర్,కండక్టర్ తమ నిజాయితీని,మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.పెద్దపల్లి జిల్లా ముత్తారం ఎంపీడీఓ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న రామయ్య అనే ఉద్యోగి శుక్రవారం గోదావరిఖని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు.అయితే,ప్రయాణ హడావుడిలో ఆయన తన విలువైన సెల్‌ఫోన్‌ను బస్సులోనే మరిచిపోయి దిగిపోయారు.బస్సు చివరి స్టాప్‌కు ఓడేడ్ చేరుకున్న అనంతరం డ్రైవర్ జంగం శ్రీనివాస్, కండక్టర్ రాణిలు బస్సును తనిఖీ చేస్తుండగా సీటుపై సదరు మొబైల్ ఫోన్ లభించింది.దాంతో వారు ఆ ఫోన్‌ను భద్రపరిచారు. అనంతరం బాధితుడు రామయ్యను సంప్రదించి,ముత్తారం జూనియర్ అసిస్టెంట్ సదానందం సమక్షంలో ఫోన్‌ను యజమానికి సురక్షితంగా అందజేశారు.విధుల్లో ప్రామాణికతను, నిజాయితీని చాటుకున్న ఆర్టీసీ సిబ్బందిని పలువురు గ్రామస్తులు, ప్రయాణికులు అభినందించారు.

## ఘనంగా శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్లుజె–ఐజె యు ) జగిత్యాల జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలు శుక్రవారం మెట్‌పల్లి ప్రెస్ క్లబ్‌లో ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు, పాత్రికేయులు,మిత్రులు,శ్రేయోభిలాషులు శ్రీనివాస్ రావును శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు శ్రీనివాస్ రావు చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బూరం సంజీవ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్,ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాసెట్టి హరీష్, సాజిద్ పాషా, గౌరవ సలహాదారు దాసం కిషన్,క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, పాల్గొన్నారు.

## పాఠశాలలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు , పాఠశాల సిబ్బందికి ఎయిడ్స్ వ్యాధిపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు ఆదేశాల మేరకు,ఐ.సి టి.సి కౌన్సిలర్ సత్యానంద్ తో కలిసి మచ్చుపేట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఇన్‌ఛార్జ్ బొల్లం దీప్తి ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, విద్యార్థులకు ఎయిడ్స్‌పై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ... హెచ్ఐవి అనేది మానవ నిరోధక శక్తిని క్షీణింపజేసే వైరస్ అని, ఇది ముదిరిన స్థితిని ఎయిడ్స్ అంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పుష్పలత,ఆశా కార్యకర్త కల్పనలతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బంది,విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి రూ.2లక్షల బీమా చెక్కు అందజేత



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన(పిఎంజెజెబివై) పథకం కింద రాశి గుట్ట తండాకు చెందిన మృతుడు గుగులోత్ లింగం కుటుంబానికి ఆర్థిక భరోసా లభించింది. లింగం నామినీ అయిన లావణ్యకు రూ.2 లక్షల బీమా చెక్కును వీర్నపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ముదం సంతోష్ అందజేశారు. ఈ సందర్భరంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ... తక్కువ ప్రీమియంతో ఎక్కువ ఆర్థిక రక్షణ కల్పించే ఇటువంటి ప్రభుత్వ బీమా పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరు తమ అకౌంట్లకు ఈ బీమాను లింక్ చేసుకోవడం ద్వారా అనుకోని విపత్తులు సంభవించినప్పుడు కుటుంబానికి ఆసరగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సురేష్, క్యాషియర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్ దరఖాస్తులపై సర్వే



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలో చేయూత పెన్షన్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను శుక్రవారం ఎంపీఓ ఏవీ రామకృష్ణ రాజు పరిశీలించి సర్వే నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దౌడా ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఘనంగా పండిత్ దీన్‌దయాల్ జయంతి



ప్రజాపక్షం/నిజామాబాద్: అంధ, మానసిక దివ్యాంగ విద్యార్థులకు నేనున్నానంటూ మనోధైర్యం కల్పిస్తూ వారి భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేస్తున్న సేహ సొసైటీ దివ్యాంగ పాఠశాల కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి సిబ్బందిని పండిత్ దీన్‌దయాల్ పుట్టిన రోజు వేడుకల్లో నగర మేయర్ ఉమా రాణి, నుడ చైర్మన్ కేశ వేణులు అభినందించారు. తమ వంతు బాధ్యతగా మానసిక దివ్యాంగ విద్యార్థుల ఉన్నతి కోసం తమ వంతు సహాయ సహకారాలందజేస్తామని వారు చెప్పారు. జిల్లా కేంద్రంలోని మారుతి నగర్‌లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాల ఆవరణలో పండిత్ దీన్ దయాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి పూలమాలలు వేసి మాట్లాడారు. చదువుతో పాటు సాంస్కృతిక నృత్యాలు, పాటలు, యోగ చేయటం ఎంతో గొప్ప విషయమన్నారు. ఇంతగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న సేహ సొసైటీ నిర్వహకులు, ఉపాధ్యాయ సిబ్బందిని ప్రతిఒక్కరిని అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు సైతం ప్రదర్శనలు చేశారు.సిద్ధయ్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ విఠల్



ప్రజాపక్షం / పెంచికలపేట్ : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు భక్తు సంతోష్ తండ్రి భక్తు లింగయ్య ఇటీవల మృతి చెందడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. లింగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. లింగయ్య మృతి ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్సీ భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోతుగంటి భీమన్న, నాయకులు దుగుంట రాజన్న, దాసరి చంద్రమౌళి, రామగోని శంకర్ గౌడ్, రాచకొండ కృష్ణ, రమేష్, తెలిగే రమేష్ పాల్గొన్నారు.

## రూ.36,516కు పలికిన గణేష్ లడ్డూ

ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సున్నంబట్టివాడలో వినాయకనగర్ శివసాయి గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో నిమ్మతి సుమ శ్రీనివాస్ రూ.36,516కు లడ్డూను దక్కించుకున్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. అత్యధిక ధరకు లడ్డూ పాడి భక్తులు తమ భక్తిని చాటుకున్నారని మండలి సభ్యులు తెలిపారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన భక్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్




ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన రూ.55 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించి సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీరాంపూర్‌నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి అలుపెరుగని శ్రమతో సింగరేణిని అభివృద్ధి పథంలో నిలిపారని గుర్తుచేశారు. 2025–26 ఆర్థిక సంవత్సర లాభాల్లో కార్మికులకు 40 శాతం వాటాను చెల్లించాలని ఆయన కోరారు. కార్మికులకు నెలకు మూడు మెడికల్ బోర్డుల నిర్వహణ, సొంత ఇంటి నిర్మాణానికి రెండు గుంటల స్థలంతో పాటు బ్యాంకు రుణ సదుపాయం, న్యాయమైన భద్రతా పరికరాల పంపిణీ, డిస్మిస్ అయిన కార్మికుల కేసుల పునఃపరిశీలన తదితర ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని స్పష్టం చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 30న సిసిసి కార్నర్‌లో బిజెపి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కమలాకర్ రావు, సీనియర్ నాయకుడు బేర సత్యనారాయణ, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు కుర్ర చక్రవర్తి, శ్రీరాంపూర్ నాయకులు పొన్నవేని సదయ్య, రమణవేణి శ్రీనివాస్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు గొల్ల మహేందర్, బిఎంఎస్ ఏరియా కార్యదర్శి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా వందేమాతర గేయాలాపన




ప్రజాపక్షం / మంచిర్యాల టౌన్ : వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నమామి భారతం, శ్రీ సరస్వతి విద్యాపీఠం ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాలోని వివిధ కళాశాలలు, 18 ప్రైవేట్ పాఠశాలల్లో 6,500 మంది విద్యార్థులతో శుక్రవారం సామూహిక వందేమాతర గీతాలాపన ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాపీఠం విభాగ అధ్యక్షుడు డాక్టర్ విష్ణువర్ధన్ ముఖ్య వక్తగా పాల్గొని జాతీయ భావాన్ని పెంపొందించేలా సందేశాన్ని అందించారు. దేశభక్తిని చాటేలా సాగిన ఈ గీతాలాపన విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడం పట్ల ఆచార్యులు, ప్రధానాచార్యులు, ప్రబంధకారిణి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథులుగా కార్పొరేటర్లు షేర్ శ్రీలక్ష్మి, సుధమల్ల హరికృష్ణ, పాఠశాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వియత్నాం విద్యా విధాన అధ్యయనానికి కరుణ ఎంపిక



ప్రజాపక్షం / జన్నారం : వియత్నాం దేశ విద్యా విధానాన్ని అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన 32 మంది ఉపాధ్యాయుల బృందంలో మంచిర్యాల జిల్లా జన్నారం మండలానికి చెందిన అంకం కరుణ ఎంపికయ్యారు. మండలంలోని అక్కపల్లిగూడెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆమె ఈ అరుదైన అవకాశం దక్కించుకోవడం పట్ల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాజాల శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎన్.విజయకుమార్, మండల విద్యాధికారి బానావత్ రాజేందర్, చైర్మన్ రమాదేవి, పిఆర్టియు అధ్యక్షుడు కట్ట రాజమౌళి, ప్రధాన కార్యదర్శి అనుముల రాజన్న, ఉపాధ్యాయులు అజ్మీర రమేష్, నెమలికొండ కృష్ణ, కొంత మంజుల, గంధం శ్రీలత, ఉద్యోగులు శ్రీకాంత్, నైజ, లలిత, పూజ పాల్గొన్నారు.

## ఆకుతోట చెరువు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాపక్షం / జైపూర్ : మండలంలోని పొనూర్ గ్రామ ఆకుతోట చెరువు (కొత్తచెరువు) మత్తడి, తూములు మరమ్మతులను అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయకట్టు రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెరువులో చేపల పెంపకానికి అనుమతులు ఇచ్చిన అధికారులు నీటి నిల్వకు కీలకమైన నిర్మాణాలను గాలికొదిలేశారని రైతులు మండిపడుతున్నారు. శిథిలావస్థకు చేరిన మత్తడి కారణంగా చెరువులోని నీరు నిత్యం వృథాగా పోతుండటంతో సాగునీరు అందక పంటలు ఎండిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేపల పెంపకానికి అనుమతులు మంజూరు చేసిన సమయంలో మత్తడి, తూముల పరిస్థితిని ఎందుకు పరిశీలించలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. నీరు నిరంతరం వృథాగా పోతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో చెరువును పరిశీలించి, మత్తడి, తూములకు వెంటనే మరమ్మతులు చేపట్టి సాగునీటిని కాపాడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## అంగన్వాడీ చిన్నారులకు పలకల పంపిణీ

ప్రజాపక్షం / జన్నారం : మండలంలోని కిష్టాపూర్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో పిసిఆర్ (పూర్ణచంద్రరావు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు 50 పలకలను అందజేశారు. చిన్నారుల్లో చదువుపై ఆసక్తిని పెంచేందుకు ఫౌండేషన్ ముందుకొచ్చి విద్యా సామగ్రి అందించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రాథమిక విద్య బలోపేతానికి స్వచ్ఛంద సంస్థలు తోడ్పాటు అందించడం ఎంతో ప్రశంసనీయమని స్థానికులు పేర్కొన్నారు. ప్రవీణ్, ఫౌండేషన్ సభ్యులు నోముల రాజ్‌కుమార్, కొత్త శ్రీనివాస్, కానగంటి దేవయ్య, సాయి కిరణ్, ఇప్ప మహేష్, అంగన్వాడీ సూపర్‌వైజర్ పి.వాణి, ఎంపిపిఎస్ ఉపాధ్యాయుడు సుధాకర్ నాయక్, అంగన్వాడీ టీచర్లు స్వరూప, వనిత, యశోద పాల్గొన్నారు.



## మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోండి: ప్రిన్సిపల్ కృష్ణవేణి

ప్రజాపక్షం/నేరడిగొండ: నేరడిగొండ మండలంలోని బుగ్గారం(బి తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కృష్ణవేణి ఒక ప్రకటనలో వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు అవసరమైన సర్టిఫికెట్లతో సెప్టెంబర్ 26వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 26వ తేది తుది గడువు అని, మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## మావలలో ఘనంగా గణపతి నిమజ్జనోత్సవం

ప్రజాపక్షం/మావల: మావల మండల కేంద్రంలో భక్తులు గణపతి నిమజ్జనోత్సవాన్ని అత్యంత వైభవంగా జరుపుకున్నారు. నవరాత్రులు పూజలందుకున్న గణనాథులకు భక్తులు ఘనంగా సాగనంపారు. సంగీత నృత్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ శోభాయాత్ర నిర్వహించి, అనంతరం స్వామివారి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో జలనిమజ్జనం చేశారు. ఊరేగింపులో భక్తులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని జై గణేష్ నామస్మరణలతో హోరెత్తించారు.

## వందేమాతరం



ప్రజాపక్షం/భీమ్‌గల్ : మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యా మందిర్ పాఠశాల భీమ్‌గల్ ఆధ్వర్యంలో శుక్రవారం పూర్తిస్థాయి వందేమాతరం గానాన్ని సామూహికంగా ఆలపించారు. వందేమాత రం గేయం ఆనాడు స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారి గుండెల్లో రైలు పరుగెత్తించి భారతీయుల ఐక్యతకు ఎంతో తోడ్పడింది. అలాగే వందేమాతరం నినాదం ప్రారంభమై నేటికి 150 సంవత్సరాలు పూర్తయిన విద్యార్థులకు ఈ గేయం గొప్పతనాన్ని వివరించారు. పాఠశాల ప్రధాన కార్యదర్శి నర్సయ్య, మనోహర్, సాయిచరణ్, నర్సారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కమ్మర్‌పల్లిలోని శ్రీ సరస్వతి విద్యామందిర్ ఆర్మూర్ పాఠశాల ఆధ్వర్యంలో క్షత్రియ కళ్యాణ మండపంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేంపల్లి ప్రతాప్ మాట్లాడుతూ బంకిం చంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్యోద్యమంలో జాతీయ చైతన్యాన్ని రగిలించిన నినాదంగా నిలిచిందన్నారు.1905లో బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్‌ను విభజించిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమైందని ప్రతాప్ పేర్కొన్నారు. బెంగాల్ శజభజనకు వ్యతిరేకంగా సాగిన స్వదేశీ ఉద్యమంలో వందేమాతరం గీతం ప్రజలను ఏకం చేసే శక్తిగా మారిందన్నారు. బెంగాల్‌కు మాత్రమే పరిమితం కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాలకు స్వదేశీ ఉద్యమం విస్తరించిందన్నారు. ఆంధ్ర ప్రాంతంలోనూ ఉద్యమం ఉధృతంగా సాగిందన్నారు.వందేమాతరం గీతం దేశభక్తి జాతీయ ఐక్యతకు ప్రతీకగానిలిచిందన్నారు. ప్రతి పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించేలా విద్యార్థుల్లో అవగాహన కలిపించాలని సూచించారు. కార్యక్రమంలో గంగారెడ్డి, ఆనంద్, రజనీకాంత్, ప్రసన్నగౌడ్, భానుతేజ్, అభిమన్యు, వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనం

ప్రజాపక్షం/నిజామాబాద్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రతిష్ఠించిన వినాయకుని నిమజ్జనోత్సవం శుక్రవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. విఘ్నాలు తొలగించే ఆదిదేవుడైన గణనాథుడిని అందంగా అలంకరించిన రథంలోకి చేర్చి నిమజ్జనానికి తరలించారు. శోభాయాత్ర సందర్భంగా దారి పొడుగున కలెక్టరేట్‌లోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు చేస్తూ ఆనందోత్సాహంతో నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



**ప్రజాపక్షం/భైంసా :** కుబీర్ మండల కేంద్రంలో గణేష్ ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ముధోల్ మాజీ శాసనసభ్యులు జీ.విట్టల్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాటలో నిర్మల్ జిల్లా డీసీసీ కార్యదర్శి సూది రాజన్న రూ.55 వేలతో లడ్డూను దక్కించుకున్నారు.వేలం పాటలో భక్తులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు జీ. విఠల్ రెడ్డి గ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.గణేష్ ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత,సోదరభావాన్ని పెంపొందించేలా ఉండాలని, నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు,భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించిన నిఖిల

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అభినందనలు



**ప్రజా పక్షం/భైంసా :** భైంసా పట్టణంలోని కిసాన్ గల్లీకి చెందిన తాడివార్ కరుణాకర్ కుమార్తె నిఖిల కొడంగల్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించిన సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆమెను ఘనంగా సత్కరించి అభినందించారు. విద్యావంతులైన యువత భవిష్యత్తులో సమాజానికి మరింత సేవ చేయగలరని ఎమ్మెల్యే తెలిపారు.నిఖిల తన వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి, ప్రజలకు సేవ చేసే మంచి వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు.ఆమె తల్లిదండ్రులకు కూడా ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు,గల్లీ వాసులు,తదితరులు ఉన్నారు.

## పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

**ప్రజా పక్షం/భైంసా :** పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ప్రజా ట్రస్ట్ చైర్మన్,బీజేపీ సీనియర్ నాయకులు భోస్లే మోహన్‌రావు పటేల్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మోహన్‌రావు పటేల్ మాట్లాడుతూ భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక నాయకులలో ఒకరైన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ దేశానికి, సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ సిద్ధాంతాలు సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు.

## జోనల్ స్థాయి నెట్‌బాల్ పోటీలకు స్లేట్ విద్యార్థులు ఎంపిక





**ప్రజాపక్షం / జన్నారం :** మంచిర్యాల జిల్లా మందమర్రిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన స్థానిక స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్14, అండర్17 బాలబాలికల విభాగాల్లో స్లేట్ ది సిబిఎస్ఇ పాఠశాల నుంచి వి.సాత్విక్, కె.సాయి దీక్షిత్, వి.రితిక, ఎల్.వర్షిని, వి.శ్రీహిత, ఎ.శ్రీవర్ష ఎంపిక కాగా, స్లేట్ హైస్కూల్ నుంచి కె.హర్షవర్ధన్, బి.కార్తీక్, పి.శ్రీనిత్య, బి.గాయత్రి దేవి, బి.రిశ్విక్, కె.ఆర్యన్, టి.కృష్ణతేజ, ఆర్.అక్షర జోనల్ స్థాయికి అర్హత సాధించారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు గుర్తింపు తేవడం గర్వకారణమని సంస్థ చైర్మన్ డాక్టర్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. జోనల్ స్థాయి పోటీల్లోనూ రాణించి మరిన్ని విజయాలు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేందుకు అవసరమైన శిక్షణ, పూర్తి ప్రోత్సాహం అందిస్తామని యాజమాన్యం స్పష్టం చేసింది. డైరెక్టర్ ఏనుగు రజిత రెడ్డి, ప్రిన్సిపాల్లు శిరీన్ ఖాన్, ప్రియ శివ, పీఈటీలు బానోత్ సంతోష్, మంతెన నగేష్, జోష్నా, వినోద్, నాగరాజ్ విద్యార్థులను అభినందించారు.

## దేశం లో ఉన్న ప్రతీ ఒక్కరూ వందేమాతరం పాడాల్సిందే

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**ప్రజాపక్షం/భైంసా :** దేశం లో ఉన్న ప్రతి ఒక్కరు వందేమాతరం పాడాల్సిందేనని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు.శుక్రవారం భైంసా లోని ఎస్. ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీ లో విద్యభారతి,అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో,నమామి భారతం పేరిట వందేమాతరం సామూహిక గానం చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. వందేమాతరం పాడని వారు దేశ ద్రోహులే అన్నారు.వందే మాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గేయం రచించిన బంకింగ్ చంద్ర చటర్జీ ని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వందే మాతరం మాతరం గేయం పై పార్లమెంట్ లో చట్ట బద్ధత కల్పించడం జరిగిందన్నారు. తెలంగాణ అసెంబ్లీ లో వందేమాతరం పాడుతూఉంటే కొందరు పాడక పోవడం సరి కాదన్నారు.వారిని దేశ ద్రోహుల కిందే పరిగణించాల్సి వస్తుందన్నారు.ఈ కార్యక్రమానికి ప్రధాన వక్త గా ఇందూర్ విభాగ్ ప్రచారక్ నర్ర వెంకట శివ కుమార్ హాజరయ్యారు.ఆయా పాఠశాల విద్యార్థులు పెద్ద మొత్తం లో హాజరయ్యారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ తుమ్మెల్ల దత్తాత్రి,వివిధ విభాగాల ప్రముఖులు సరికొండ దామోదర్, కృష్ణ దాస్, గంగాధర్ గౌడ్,శ్రీధర్,పురుస్తు గోపాల్ కిషన్,పెండపు కాశీనాథ్ కౌన్సిలర్ లు ప్రజా ప్రతినిధులు,తదితరులు ఉన్నారు.

# చేయూత పింఛన్‌ల వెరిఫికేషన్



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని అర్లీ గోడి డిసెర గ్రామపంచాయతీలో చేయూత పింఛన్ లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రక్రియను ఎంపీవో సల్మాన్‌రాజ్ శుక్రవారం రోజున క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ప్రభుత్వం అందిస్తున్న చేయూత పింఛన్ పథకానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంతోపాటు వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.లబ్ధిదారుల కుటుంబ పరిస్థితులు,అర్హతలు,అందుబాటులో ఉన్న వివరాలను పరిశీలించి నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.అర్హులైన ఏ ఒక్కరూ పింఛన్ సౌకర్యానికి దూరం కాకుండా, అనర్హులు జాబితాలో చేరకుండా వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.పింఛన్ లబ్ధిదారుల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అవసరమైన ధ్రువపత్రాలు, క్షేత్రస్థాయి వివరాలను పరిశీలించాలని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు సంబంధించిన సమాచారాన్ని సక్రమంగా సేకరించి ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు.అలాగే గ్రామంలోని నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రసన్న వినోద్,పంచాయతీ కార్యదర్శిచ పంచాయతీ జిపిఓ,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## భోసి వరసిద్ధి కర్ర వినాయకుడి శోభాయాత్ర

### లడ్డూ ప్రసాదం రూ.71 వేలకు వేలం

**ప్రజాపక్షం/తానూర్ :** శ్రీ వరసిద్ధి కర్ర వినాయకుడి శోభాయాత్ర, మహోత్సవం భోసి గ్రామంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగాయి.డప్పుచప్పుళ్లు, భజనలు, కోలాటాల నడుమ స్వామివారి ప్రతిమను గ్రామ ప్రధాన వీధుల గుండా శోభాయాత్రగా ఊరేగించారు.భక్తులు జై బోలో గణేష్ మహారాజ్ కీ నినాదాలతో హోరెత్తించారు.మహిళలు మంగళహారతులతో స్వాగతం పలకగా,యువకులు నృత్యాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వేలం పాట ఆకట్టుకుంది. లడ్డూ ప్రసాదాన్ని పసుల భోజన్న (భోసి) రూ.71,000కు దక్కించుకున్నారు.పాలక బలపం రూ.12,000కు మదన్న ఎంగులు,కందువా రూ.5,500కు కనకాపూర్ లక్ష్మణ్,కాఫీ పెన్ రూ.5,100కు జక్క హన్మండ్లు,చిన్న కందువా రూ.2,800కు సబ్బన్ రఘు సొంతం చేసుకున్నారు.కార్యక్రమంలో భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.ఇక్కడి ప్రత్యేకత ఏమిటంటే కర్ర వినాయకుడికి నిమజ్జనం చేయరు. శోభాయాత్ర అనంతరం గ్రామ చెరువు నీళ్లు చల్లి కర్ర వినాయకుడిని మహాదేవుని ఆలయంలోని ఒక బీరువాలో భద్రపరుస్తారు. మళ్లీ వినాయక చవితి రోజున దానిని తీసి ప్రతిష్ఠిస్తారు. ఇదే తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ.కర్ర వినాయకుడిని దర్శిస్తే కోర్కెలు నెరవేరుతాయన్న విశ్వాసంతో చుట్టుపక్కల గ్రామాల భక్తులు భారీగా తరలివచ్చారు.వేలం ద్వారా వచ్చిన నిధులను ఆలయ అభివృద్ధి,ఉత్సవ నిర్వాహణకు వినియోగించనున్నట్లు స్థానిక సర్పంచ్ సాగర్ బాయి నాగనాథ్,గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఉత్తం బాలేరావ్, గ్రామ,ఆలయ,మీటింగ్ నిర్వాహకులు తెలిపారు.

## రాష్ట్రస్థాయి జానపద జాతరకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం / మంచిర్యాల :** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో కరీంనగర్‌లో అక్టోబర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి జానపద సాంస్కృతిక జాతర ప్రదర్శనలకు కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంకల్ప సేవా సంస్థ అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు. సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. జానపద పాటలు, నృత్యాలు, ఒగ్గు కథ, డప్పు, కోలాటం, బతుకమ్మ, బోనాలు, బుర్రకథ తదితర కళాకారులు 28లోగా 944098 8001 నంబరును సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## మార్గమధ్యలో ప్రసవం.. సకాలంలో ఆసుపత్రికి చేర్చిన 108 సిబ్బంది

**ప్రజాపక్షం / కోటాల :** వేరవెల్లి గ్రామానికి చెందిన పి.అశ్విని(25)కి వేరవెల్లికోటాల మార్గమధ్యలో రెండో కాన్పు జరగగా సమాచారం అందుకున్న 108 సిబ్బంది సకాలంలో స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. 108 ఈఎంటీ ఎర్ర అజయ్ కుమార్, పైలట్ పి.నరేష్ సమయస్ఫూర్తితో వ్యవహరించి తల్లిని సురక్షితంగా కోటాల పీహెచ్‌సీకి చేర్చారు. ఆపత్కాలంలో తక్షణమే స్పందించి సేవలు అందించిన సిబ్బందిని అశ్విని కుటుంబ సభ్యులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## మురుగులోనే బస్టాండు

### కౌన్సిలర్ కొప్పుల ప్రభాకర్

**ప్రజాపక్షం/చెన్నూరు :** చుట్టూ మురుగు నీరు, పందుల సంచారంతో చెన్నూరు బస్టాండు అధ్వానంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 7వ వార్డు కౌన్సిలర్ కొప్పుల ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్టాండు పరిసరాల్లో నెలకొన్న అపరిశుభ్రతపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బస్టాండు ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తోందని తెలిపారు. ఈ దుస్థితి కారణంగా చుట్టుపక్కల కాలనీల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ బస్టాండుపై అధికారులు, పాలకుల నిర్లక్ష్యం గురించి చుట్టుపక్కల పల్లెల్లో కథలు కథలుగా చెప్పుకుంటున్నా స్థానిక మంత్రి స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి బస్టాండు ప్రాంగణాన్ని శుభ్రం చేయించాలని, పందుల సంచారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే బిఆర్ఎస్ బస్టాండులోనే నిరసన కార్యక్రమాలు చేపట్టి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగడతామని ప్రభాకర్ హెచ్చరించారు.

## వందేమాతరం సమైక్యతా స్ఫూర్తి గీతం

### డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** వందేమాతరం గీతం 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యాభారతి పిలుపు మేరకు నమామి భారత్ ఆధ్వర్యంలో శుక్రవారం కాగజ్‌నగర్‌లోని పలు విద్యాసంస్థల్లో ఉదయం 11 గంటలకు సామూహిక గీతాలాపన నిర్వహించారు. సుప్రభాత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులతో కలిసి గీతాన్ని ఆలపించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో దేశభక్తిని రగిలించిన అమర గీతం వందేమాతరమని, యువత జాతీయ భావాలను పెంపొందించుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పురపాలక వైస్ చైర్మన్ డాక్టర్ కొత్తపల్లి అనిత, నాయకులు ఇందూరి వెంకటేశం, రాపెల్లి సదానందం, ప్రధానాచార్యులు నేరెళ్ల శ్రీవాణి, లక్ష్మీ నరసింహ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ఖజానా అధికారిగా హమిద్దా ఖాన్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జిల్లా ఖజానా శాఖ ఇన్చార్జి అధికారిగా హమిద్దా ఖాన్ శుక్రవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. పెద్ద పల్లి జిల్లా మంథని డివిజన్ ఖజానా కార్యాలయంలో సహాయ ఖజానా అధికారిగా పనిచేస్తున్న ఆయనను డిప్యూటేషన్‌పై జిల్లా ఖజానా అధికారిగా నియమిస్తూ రాష్ట్ర ట్రెజరీ శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కె.హరిత నేతృత్వంలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ బిల్లుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతన అధికారికి కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఖజానా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాసరలో మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు



**ప్రజాపక్షం/భైంసా :** బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను బాసర పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి సురక్షితంగా కాపాడారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.గోదావరి నది వద్ద ఓ మహిళ ఆత్మహత్యకు యత్నిస్తున్నట్లు స్థానికులు అందించిన సమాచారంతో బాసర పోలీసులు తక్షణమే స్పందించారు. సంఘటనా స్థలానికి చేరుకుని, చాకచక్యంగా వ్యవహరించి ఆ మహిళను ఒడ్డుకు తీసి రక్షించారు.ఆమెను బాసర పోలీస్ స్టేషన్‌కు తరలించారు.స్టేషన్ హౌస్ ఆఫీసర్ దీపక్ సదరు మహిళకు,ఆమె కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

## దసరా కానుకగా ఆర్‌టిసి ప్రత్యేక ఆఫర్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాబోయే దసరా సెలవులను పురస్కరించుకుని ప్రయాణికులు, భక్తుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్మల్ డిపో నుంచి మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గృష్ణేశ్వర్ జ్యోతిర్లింగానికి ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె. పండరి తెలిపారు.ఈ ప్రత్యేక బస్సు సర్వీసు అక్టోబర్ 13వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 02:00 గంటలకు నిర్మల్ బస్టాండ్ నుండి బయలుదేరుతుంది. రెండు రోజుల పాటు సాగే ఈ యాత్రలో కేవలం 2,000 రూపాయలకే అవుండా నాగనాథ్, భద్ర మారుతి, గృష్ణేశ్వర్ జ్యోతిర్లింగం, ఎల్లోరా గుహలు, మరియు ఔరంగాబాద్ లోని బీబీ కా ముక్బారా (మిని తాజ్ మహల్) వంటి 5 ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను సందర్శించే అద్భుతమైన అవకాశాన్ని ఆర్టీసీ కల్పిస్తోంది.ఈ దసరా సెలవుల్లో సకుటుంబ సమేతంగా ఆహ్లాదకరంగా,ఆధ్యాత్మికంగా గడపడానికి ఇది మంచి అవకాశమని, భక్తులు ఈ ప్రత్యేక బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు. మరిన్ని వివరాలకు సీట్ల బుకింగ్ కోసం 9959226003, 9440018549 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

## వరి కొనుగోలు కేంద్రాల నిర్వహణకు శిక్షణ

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో ఐకెపి కార్యాలయంలో శుక్రవారం డిపిఎం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు నిర్వహించి సబ్ కమిటీ సెంటర్లు ఆ్యాబ్ సెంటర్ బుక్ కీపర్లకు శిక్షణనిచ్చి డీపీఎం మోహన్ మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన వరి సన్నరకం ధాన్యంకు 500 ల బోనస్ ఇవ్వటం జరుగుతుందన్నారు. అక్టోబర్ 1 నుంచి వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయన్నారు. ఏపియం గంగాధర్, సీసీలు శ్రీనివాస్, మహేందర్, సంతోష్, శ్రీనివాస్, సీఆర్‌పీలు సునీత, సుజాత, ఏఓలు మెంబర్లు పాల్గొన్నారు.

## ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఖరీఫ్ పంటల కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ రెవెన్యూ రాథోడ్ రమేష్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు,కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో కలిసి ఖరీఫ్ (వానాకాలం) వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేస్తూ,పంట కొనుగోలును పకడ్బందీగా చేపట్టాలన్నారు. గతంలో క్షేత్ర స్థాయిలో ఎదురైన అనుభవాల దృష్ట్యా తగిన ప్రణాళికలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి సమస్యలు కలగకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని వివరించారు. వ్యవసాయ అధికారులు మండలాల వారీగా వివరాలు సేకరించి, తగినన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కు సంబంధించి సామాగ్రి అంతా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో పౌర సరఫరాల అధికారులు రాజేందర్,సుధాకర్,వ్యవసాయ అధికారి సుజాత,తూనికలు కొలతల అధికారి శంకర్,డిసిఓ నర్సయ్య,ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## గణపతి మంటపంలో ఘనంగా కుంకుమార్చన



**ప్రజా పక్షం /దిలావర్ పూర్ :** మండలంలోని కంజర్ గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని గణపతి మండపంలో శుక్రవారం అంబేద్కర్ గణపతి మండపం లో ప్రత్యేకంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహికంగా కుంకుమార్చన చేసి గణపతిని భక్తిశ్రద్ధలతో కొలిచారు.కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండప ప్రాంగణం గణపతి నామస్మరణతో మార్మోగింది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. కుంకుమార్చన కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మండపం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. గణపతి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు,భజనలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం..ఐసిడిఎస్ సిడిపిఓ రాజశ్రీ



**ప్రజాపక్షం/తానూర్ :** మండల కేంద్రములో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ముధోల్ సిడిపిఓ రాజశ్రీ,తానూర్ మండల సూపర్వైజర్ నిఖిత ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.పౌష్టికాహారం తోనే సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటుందని ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని సిడిపిఓ అన్నారు.ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రతినిత్యం పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని సూచించారు.పౌష్టికారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటుందని తెలిపారు. గర్భవతి మహిళలను, బాలింత మహిళలను, పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. అనంతరం ఆయుర్వేదిక్ డాక్టర్ లలిత మాట్లాడుతూ మహిళలను పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాదవ్ సుగంధబాయి,కార్యదర్శి షఫీక్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ముధోల్ రోజా,అంగన్వాడీ టీచర్స్ పవార్ వందన,శోభ,మనిషా, సావిత్ర, అనిత,సరస్వతి, సురేఖ, చంద్రకళ,నందబాయ్,వాణి,సంగీత, సవిత,అర్చన,లక్ష్మీ , గర్భవతులు,బాలింతలు,చిన్నారులు పాల్గొన్నారు.

## నిర్మల్ ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో

# వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవం

### ఎస్‌పి జానకి, ఐపిఎస్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్మల్ పోలీస్ మీ పోలీస్ అనే భావనతో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రతిష్ఠించిన శ్రీ వినాయక విగ్రహ నిమజ్జనోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది.ఈ వేడుకల్లో భాగంగా ముందుగా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రతిష్ఠించిన లంబోదరునికి జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపిఎస్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు,హారతి కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, శాంతిభద్రతలతో విలసిల్లాలని ఈ సందర్భంగా ఎస్పీ స్వామివారిని వేడుకున్నారు.ప్రత్యేక పూజల అనంతరం జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల ఉత్సాహభరిత వాతావరణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్రను జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. పోలీస్ అధికారుల మరియు సిబ్బంది భక్తిశ్రద్ధలు, జయజయధ్వానాల నడుమ శోభాయాత్ర కొనసాగింది. నిమజ్జన కార్యక్రమం అనంతరం ఎస్పీ క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి మరియు హాజరైన వారికి మహదన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ విశేష కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు వికారాబాద్ అడిషనల్ ఎస్‌పి రాజేష్ మీనా (ఐపిఎస్), భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ (ఐపిఎస్), నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, ఇతర శాఖలకు చెందిన 14 మంది డీఎస్పీలు, పలువురు సీఐలు,ఎస్సైలు,జిల్లా పోలీస్ సిబ్బంది మరియు మీడియా ప్రతినిధులు విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## సామూహిక వందేమాతరం గేయాలాపన



**ప్రజాపక్షం/బోథ్ :** మామి భారత్ వందేమాతరం 150 జయంతి సందర్భంగా శ్రీ సరస్వతివిద్యాపీఠంఆధ్వర్యంలో దేశవ్యాప్తంగాఅన్నిశిశుమందిరాలలో ఒకేసారి ఈరోజు ఉదయం 11 గంటలకు కోటి గళాలతో వందేమాతరం గేయాలపన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. భాగంగా బోథ్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సామూహిక సంపూర్ణ వందేమాతరం గేయాలపన చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పోషకులు పాల్గొన్నారు.

## మందబోగడలో పోషణ మహోత్సవం



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలంలోని మందబొగుడ గ్రామపంచాయతీ లో ప్రైమరీ స్కూల్ యందు పోషణ మాసం 2026 కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు, అంగన్వాడి పిల్లలకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలను ప్రదర్శించడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పోషణ వల్ల పిల్లలకు గర్భిణీ స్త్రీలకు ఎంతోగానోఉపయోగపడుతుందిఅని అన్నారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ బాబూలాల్,పంచాయతీ కార్యదర్శి షకీల్ అహ్మద్, అంగన్వాడి టీచర్లు జాదవ్ సొంక బాయి కుచిర్యాల్, గోదావరి మంద బొగుడ, ఆడే మునిత ధనూర్ కె, జాదవ్ లక్ష్మి ఖాన్దేపల్లి,మడవి గాంధారి అందూర్,రాణి కుమారి నారాయణపూర్,ఉపాధ్యాయుడు ఏ.దయాకర్,AO అగ్రికల్చర్ రవితేజ పాల్గొన్నారు.

## చేత పింఛన్ల పరిశీలన

### బోథ్ఎంపీడీఓ యల్.రమేష్



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని చేయూత పింఛన్ల పరిశీలనా లో భాగంగా వివిధ కాలనీలలో ఎంపీడీవోఎల్.రమేష్ చేయూత పింఛన్ల పత్రాలను పరిశీలించడం జరిగింది.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లి గ్రామంలో మేకల దేవన్న యొక్క ఇల్లు షార్ట్ సర్క్యూట్ వల్ల ఇల్లు పూర్తిగా ధ్వంసం అయింది.గ్రామస్తులు వివరాల ప్రకారం దేవన్న ఇల్లు షార్ట్ సర్క్యూట్ జరగడం వల్ల ఇల్లు పూర్తిగా ధ్వంసం అయిందని ఫర్నిచర్,టీవీ,విలువైన వస్తువులు కాలిపోయాయని తెలిపారు.సుమారు మూడు లక్షల వరకు నష్టపోవడం జరిగిందని స్థానికులు తెలిపారు.మేకల దేవన్న ఆవేదన వ్యక్తం చేస్తూ అధికారులు నాయకులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



# ఈనెల 30న కరీంనగర్‌కు సీఎం రేవంత్ రెడ్డి

## కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ప్రకటన

**ప్రజాపక్షం /కరీంనగర్ టౌన్ :** ఈనెల 30న ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కరీంనగర్ పట్టణంలో నూతన సమీకృత కలెక్టరేట్ భవనంతోపాటు పలు అభి వృద్ధి పనులను ప్రారంభించనున్నారని కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ తెలిపింది. సీఎం పర్యటన ఏర్పాట్లపై నగ రంలోని ఇందిరా భవన్ కార్యాలయంలో అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ అధ్వర్యంలో శుక్రవారం సన్నా హక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయ కులు మూడు కీలక తీర్మానాలు ఆమోదించారు. సీఎం పర్యటనకు ఘన స్వాగతం చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కలెక్టరేట్ భవనాన్ని ప్రజా ప్రభుత్వం పూర్తి చేసి ప్రారంభించడం చారిత్రాత్మక ఘట్టమని నగరవ్యాప్తంగా కాంగ్రెస్ జెండాలు, బంటింగ్స్‌తో ఘనంగా స్వాగతం పల కాలని నిర్ణయించారు. కార్యకర్తలతో సీఎం భేటీకి ఏర్పాట్లు చేయాలని మంత్రులను కోరనున్నారు. సర్ ప్రక్రి యలో సాఫ్ట్‌వేర్ లోపాల వల్ల తీవ్ర సాంకేతిక ఇబ్బందులు వస్తున్నాయని చాలామందికి నోటీసులు అందలేదని కావున అక్టోబర్ 31తో ముగిసే ఈ గడువును డిసెంబర్ వరకు పొడగించాలని డిమాండ్ చేశారు. ఓటు చోరికి నిర సనగా ఏఐసీసీ పిలుపుమేరకు సెప్టెంబర్ 28న కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపై నిలిచి సీఎం పర్యట నను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు పిలు పునిచ్చారు. ఈ సమావేశంలో బొమ్మ శ్రీరాంచక్రవర్తి, సత్తు మల్లేశం, ఆరెపల్లి మోహన్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్, ఇతర ముఖ్య నాయకులు, కార్పోరే టర్లు పాల్గొన్నారు.

## 9వ ప్యాకేజీ పనులు వెంటనే పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులను వెంటనే పూర్తి చేసి, ఉమ్మడి మద్దిమల్ల పరిధిలోని రాయిని చెరువుకు సాగునీరు అందించాలని బీజేపీ వీర్నపల్లి మండల అధ్యక్షుడు లక్‌పతి నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ ప్రాంత రైతాంగ ప్రయో జనాల కోసం బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. ఇందులో భాగంగానే, ఈ నెల 28వ తేదీన మద్దిమల్ల గ్రామం నుండి వీర్నపల్లి ఎమ్మార్వో ఆఫీస్ వరకు భారీ ర్యాలీ చేపట్టను న్నట్లు ఆయన ప్రకటించారు. 9వ ప్యాకేజీ పనుల ఆలస్యం వల్ల స్థానిక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీని విజయవంతం చేసేందుకు నియోజ వర్గ, మండల పరిధిలోని రైతులు, ప్రజలు మరియు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తర లివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుపై హర్షం

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.200 కోట్లతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' మంజూరు చేయడం పట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూక్య సంతోష్ నాయక్ తో మండల నాయ కులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ విద్యా రంగ రూపురేఖలను మార్చేలా ఇంతటి భారీ నిధులు కేటాయించి నందుకు కృతజ్ఞతగా సభకు భారీగా తరలిరా వాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్, చంద్రమౌ ళితో పాటు పలువురు స్థానిక కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మీడియా రంగానికి చెందిన మిత్రుని కోల్పోవడం అత్యంత బాధాకరం

### సీనియర్ పాత్రికేయుడు టీకే రమేష్ మృతికి పోలీసుల, జర్నలిస్టుల సంతాపం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** మీడియా రంగా నికి చెందిన టీకే రమేష్ మిత్రుడికి కో లిపో వడం డిసిపి భూక్య రాం రెడ్డి,ఎసిపి గజ్జి కృష్ణ అన్నారు. సుల్తానాబాద్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ చంద్రకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు టీకే రమేష్ గుండెపోటుతో మృతి చెందడం పట్ల విచారం వ్యక్తం చేసి శుక్రవారం పోలీ సులు,స్థానిక జర్నలిస్టు రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ రమేష్ మృతి జర్నలిజం రంగానికి తీరని లోటని అన్నారు.ప్రజా సమస్యలను వెలుగు లోకి తీసుకురావడంలో ఆయన చేసిన సేవ లను స్మరించుకున్నారు.రమేష్ కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు.ఈ కార్యక్ర మంలో డీసీపీ భూక్య రాంరెడ్డి,పబ్లిక్ ప్రాసి క్యూటర్ దొంకెన రవి, ఏసీపీ గజ్జి కృష్ణ సీఐలు రంజిత్‌రావు,ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు చంద్రకుమార్,అశోక్‌రెడ్డి,పోలీసు సిబ్బంది,జర్నలిస్టులు,తదితరులు పాల్గొ న్నారు.

## అంత్యోదయ స్ఫూర్తిప్రదాత పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ

### బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత, దేశభక్తికి నిలువెత్తు రూపం పండిత్ దీన్ దయాల్ ఉపా ధ్యాయ అని బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం అన్నారు. భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పార్లమెంట్ కార్యాలయంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థిగా విచ్చేసిన ఆయన పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ సమాజాభివృద్దే ధ్యేయంగా దీన్ దయాల్ జీవితం కొనసా గిందన్నారు. భరతమాత ముద్దు బిడ్డ, దేశోద్ధారకుడు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయ మని కొనియాడారు. ఆయన ప్రతి పాదించిన ఏకాత్మ మానవతావాదం భావజాలం దేశ రాజకీయాలకు, సమాజానికి ఎప్పటికీ మార్గదర్శక మన్నారు. అంత్యోదయ సిద్ధాంతమే మన మార్గం అని సమాజంలో అట్ట డుగున ఉన్న చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలనే ధ్యేయంతో పండిత్ దీన్ దయాల్ ఉపా ధ్యాయ అంత్యోదయ సిద్ధాంతం కోసం తన జీవితాన్ని పూర్తిగా అంకితం చేశారని తెలిపారు. ఆయన నిస్వార్థ రాజకీయాలు, అంకితభావం, దేశభక్తి నేటి తరానికి నిలు వెత్తు నిదర్శనమన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త ఆయన ఆశ యాలను సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, గుజ్జ శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచెర్ల రాజు, గుంజేటి శివకుమార్, కటకం లోకేశ్, ఉగిలే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## చెక్ బౌన్స్, బ్యాంకు రుణాల రికవరీపై ప్రత్యేక లోక్ అదాలత్

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** చెక్ బౌన్స్, బ్యాంకు రుణాల రిక వరీకి సంబంధించిన కేసుల పరిష్కారం కోసం నవంబర్ 17న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్ తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శుక్ర వారం కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయవాదులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో పరిష్కరించదగిన కేసుల్లో ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో రాజీ చేసు కునే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా చెక్ బౌన్స్, బ్యాంకు రుణాల రికవరీ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా న్యాయవాదులు కక్షిదారులకు అవగా హన కల్పించాలని సూచించారు.కౌన్సెలింగ్ అవసరమైన కేసుల్లో మధ్యవర్తిత్వ కేంద్రం సేవలను వినియోగించుకో వాలని కోరారు. వారెంట్ పెండింగ్‌లో ఉన్న కేసుల పరి ష్కారానికి అవసరమైన సందర్భాల్లో పోలీసుల సహకారం తీసుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను



త్వరితగతిన,పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సమావేశంలో ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ విను కొండ మాధవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి,న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు,కుమారం శ్రీనివాస్,గంధ్ర ప్రవీణ్ రావు,కోటగిరి వెంకటస్వామి, కంతి మోహన్ రెడ్డి, వేముల సునీల్, పుప్పాల లింబాద్రి, జేడి సుధాకర్,హరిభూషన్,గురిజెల గోపి,అందె సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పండిట్ దీన్ దయాల్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పండిట్ దీన్ దయాల్ ఆశ యాలు నేటి తరానికి ఆదర్శమని బిజెపి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి,మండల అధ్యక్షులు కాంగ్రెస్ అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జన సంఘ్ ప్రముఖ నాయకులు,తాత్వికవేత్త పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈసందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ 1951లో భారతీయ జనసంఘ్ ఏర్పడిన అనంతరం ఆయన సంస్థాగత నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. 1953 నుంచి 1968 వరకు జనసంఘ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి,పార్టీని దేశవ్యాప్తంగా బలో పేతం చేయడంలో విశేష కృషి చేశారు. 1967లో జన సంఘ్ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించా రని,దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రధాన ఆలోచనా వారస త్వంలో "ఏకాత్మ మానవతావాదం" ముఖ్యమైనది. వ్యక్తి,సమాజం,ప్రకృతి మధ్య సమన్వయాన్ని ఆయన ప్రతి పాదించారు. 1965లో ముంబైలో వరుసగా నాలుగు ఉప న్యాసాల ద్వారా ఈ సిద్ధాంతాన్ని విస్తృతంగా వివరించా రని తెలిపారు.

## పార్టీ కార్యాలయం పనులు పరిశీలించిన మంత్రి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/ఎండపల్లి :** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాం పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయ పనులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా కార్యాలయంలో ఆఫీస్ రూమ్, వెయిటింగ్ హాల్ నిర్మాణం కొరకు భూమి పూజ నిర్వహించారు. దసరా లోపు పార్టీ కార్యాల యం పనులు పూర్తిచేసి కార్యకర్తలకు కార్యాలయాన్ని అందుబాటు లోకి తీసుకొస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. మంత్రి వెంట వెల్గటూర్, ధర్మారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు శైలేం దర్ రెడ్డి, రూప్ల నాయక్, గోపాల్ రెడ్డి, చంద్రా రెడ్డి తో పాటు పలు వురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## లింక్ రోడ్డుకు మరమ్మతులు చేయాలి

**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** రాఘవపేట చిట్టాపూర్ గ్రామాల మధ్య ఉన్న లింకు రోడ్డు గుంతల మయం కావడంతో మరమ్మత్తులు చేప ట్టాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలమ కార్పోరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావుకు మండల కాంగ్రెస్ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. శుక్రవారం మెట్పల్లి లోని పార్టీ కార్యాలయంలో కలిసి రాఘవపేట చిట్టాపూర్ గ్రామాల మధ్య లింక్ రోడ్డుకు నిధులు కేటాయించి మరమ్మత్తులు చేపడితే ఇరువు గ్రామాలకు సౌకర్యంగా ఉంటుందని కోరగా సానుకూలంగా స్పందించినట్లు రాఘవపేట కాంగ్రెస్ పార్టీ నాయకుడు నత్తిరామ్ తెలిపారు. ప్రజా సమస్యల పట్ల సత్వరమే స్పందిస్తున్న నర్సింగరా వుకు రాము ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల నాయకులు ఉన్నారు.

## 29న ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం సీతా రాంపూర్‌లోని మహర్‌నగర్‌లో గల ఈవెన్ గార్డెన్‌లో ఈనెల 29న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. గౌతమి ఫౌండేషన్, శంకర ఐ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. శిబిరానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను శుక్ర వారం కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు అందజేశారు. ఆయన నివాసంలో గౌతమి ఫౌండేషన్ నిర్వాహకులు డా.గౌతమి ఆహ్వాన పత్రికను అందించారు. అవసరమైనవారు శిబి రంలో కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, యూసుఫ్ అలీ, జమ్ము, మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, పలువురు వైద్యులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ కాలువలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** వినాయక నిమజ్జనం ఉత్సవాల్లో ఎస్సా రెస్పీ కాలువలో పడి గల్లంతైన యువకుడి మృతదేహాన్ని శుక్రవారం మానేరు డ్యాంలో గుర్తించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన తాండ్ర రుద్ర (18) అనే యువకుడు మల్లాపూర్ క్రాస్ రోడ్డు వద్ద కెనాల్‌లో వినాయక విగ్రహ నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. కెనా ల్‌లో నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. దీంతో యువకుడి ఆచూకి కోసం అధికారులు, పోలీసులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలు సుకున్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లే శంతో కలిసి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికితీసే ప్రక్రియను స్వయంగా దగ్గరుండి పర్యవే క్షించారు. పోలీసులు, స్థానికులు, సిబ్బంది సహాయంతో మృతదే హాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్ మృతుడు రుద్ర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి భరోసా కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం కుటుంబానికి సహాయ సహకారాలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 20వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని 20వ వార్డులో తెలం గాణ ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్ర మాన్ని కౌన్సిలర్ మాసుల ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబం స్మార్ట్ రేషన్ కార్డు లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు మరింత పారదర్శకంగా, సులభంగా అందించేందుకు ప్రభుత్వం ఈ కార్డులను అందిస్తోందన్నారు.వార్డు ప్రజలు, అధికారులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.